

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయం

- కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్

బంజారాహిల్స్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయకుండా పనిచేస్తున్నామని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమాజిగూడ డివిజన్ సాజిత్ మంజిల్‌లో 25 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బీఎస్ మక్తాలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. డ్రైనేజీ సమస్య తలెత్తడంతో కాంట్రాక్టర్, జలమండలి అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశలవారీగా డివిజన్‌లో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

బోరబండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్థాయీ సంఘం సభ్యుడు సి.ఎన్.రెడ్డి జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బస్తీలు అధికంగా ఉన్న ప్రాంతం కావడంతో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జలమండలి ఎండీ సానుకూలంగా స్పందించారని సి.ఎన్. రెడ్డి తెలిపారు.



జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

బీఆర్ఎస్ మోసాన్ని గ్రహించడంతోనే కాంగ్రెస్‌కు అధికారం

- కోట నీలిమ

బంజారాహిల్స్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్తు ప్రణాళికతో పనిచేస్తున్నారని, అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయడం ఆయనకు తెలియదని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బూటకపు వాగ్దానాలతో బీఆర్ఎస్ నేతలు పది సంవత్సరాలు పాలించారని, అందుకే వారి మోసాన్ని గ్రహించిన ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారన్నారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా రూ.11,600 కోట్లతో 55 నియోజకవర్గ కేంద్రాలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు క్రీడా సౌకర్యాలతో పాటు ప్రపంచ స్థాయి విద్య అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పోలీసులకు ప్రశంస



బంగ్లాదేశ్‌లో మనుషుల అక్రమ రవాణా కేసులో బాధితులను రక్షించడంలో కీలకంగా వ్యవహరించిన ఫిలింనగర్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, పంజాగుట్ట కానిస్టేబుల్ నెనావత్ లావణ్యలకు ప్రశాంసాపత్రాలు అందజేస్తున్న నగర సీపీ సీవీ ఆనంద్

- బంజారాహిల్స్, మార్చి 10(ఆంధ్రజ్యోతి)

శుభాకాంక్షలు



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన దాసోజు శ్రావణ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

- బంజారాహిల్స్, మార్చి 10(ఆంధ్రజ్యోతి)

'సున్నం'కు పూర్వ వైభవం సవాలే

- మురుగు నీటి ప్రవాహాన్ని ఆపకుండా సున్నం చెరువులో పూడికతీత అసాధ్యం
- గతంలో నిర్మించిన అక్రమ కట్టడాల తొలగింపుపై లేని స్పష్టత
- స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని హైడ్రాను కోరుతున్న స్థానికులు

బోరబండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సున్నం చెరువు ఒకప్పుడు వ్యవసాయ అవసరాలను తీర్చేది. పూర్వం వందల ఎకరాలకు సాగు నీటిని అందించేది. అయితే కాలక్రమేణా నగరం విస్తరించడంతో చెరువు ఆక్రమణలకు గురైంది. మురుగు నీటితో కాలుష్య కాసారంగా మారింది. దీంతో బోరబండ, అల్లాపూర్, మాదాపూర్ డివిజన్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజల నుంచి పలుమార్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు బోరబండ డివిజన్ సైట్-3కి ఆనుకొని అల్లాపూర్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోకి వచ్చే ఈ చెరువును శుద్ధి చేసేందుకు హైడ్రా సన్నాహాలు చేస్తోంది. చెరువుకు ఆనుకొని నిర్మించిన అక్రమ కట్టడాలను గతంలో కూల్చివేశారు. ఇటీవల సున్నం చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువు నీటిని పూర్తిగా తొలగించి పూడిక తీసి శుభ్రం చేస్తామని ప్రకటించారు. తొలిదశ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు.

ఆ నిర్మాణాలను ఏం చేస్తారు?

సున్నం చెరువు చుట్టూ కొత్తగా చేపట్టిన నిర్మాణాలను హైడ్రా ఇటీవలే కూల్చివేసింది. అయితే పాత నిర్మాణాల్లో నివాసముంటున్న వారి విషయంలో హైడ్రా ఇంత వరకు ఎలాంటి ప్రణాళిక ప్రకటించలేదు. చెరువు శిఖం భూమి ఇప్పుడు పూర్తి స్థాయిలో కనుమరుగైంది. ఈ పరిస్థితుల్లో చెరువుకు పూర్వవైభవం తీసుకురాలేని క్రమంలో కనీసం ఉన్న దాన్ని సంరక్షించాలన్నా హైడ్రా అనేక కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ముందుగా హద్దులు నిర్ణయించి దాని లోపల ఉన్న నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు మురుగుకు అడ్డుకట్ట వేయాలి. ఆ తరువాతే శుద్ధీకరణ చేస్తే భవిష్యత్తులో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎస్టీపీసీ ప్రాజెక్ట్ కింద పైప్‌లైన్‌లు వేస్తే మంచి ఫలితం ఉండే అవకాశాలు ఉన్నాయంటున్నారు. మరి హైడ్రా అధికారులు ఏం ఆలోచిస్తున్నారు, ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.



బోరబండ సైట్-3 కాలనీ వద్ద సున్నం చెరువులోకి వస్తున్న మురుగు నీరు

చెరువులోకి నిత్యం మురుగు నీరు

సున్నం చెరువు పరిసర ప్రాంతాలకు చెందిన అనేక బస్తీలు, కాలనీల నుంచి ప్రతిరోజూ భారీ స్థాయిలో మురుగు నీరు వచ్చి ఇందులో చేరుతోంది. బోరబండ బలహీనవర్గాల కాలనీకి చెందిన 25 బస్తీలతో పాటు సైట్-3,4,5 కాలనీలు, ఎస్పీఆర్ హిల్స్‌లోని పలు బస్తీలకు చెందిన మురుగు నీరంతా భూగర్భ డ్రైనేజీ, వరద నీటి కాలువల ద్వారా నేరుగా సున్నం చెరువులోకి వస్తుంది. చెరువులో మురుగునీరు చేరే ప్రాంతంలో ఎస్టీపీ నిర్మాణం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. మూడు డివిజన్లు కలిసే చోట కల్లు కంపౌండ్ సమీపంలో చెరువులోకి మురుగునీరు చేరుతోంది. దీంతో చెరువు శుద్ధీకరణకు ముందు వివిధ బస్తీలు, కాలనీల నుంచి చెరువులోకి మురుగు నీరు చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రోజూ భారీగా మురుగు నీరు చేరుతున్న క్రమంలో ఎన్ని నీళ్లు బయటకు పంపినా ఫలితం ఉండదని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టి ముందుగా చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని, ఆ తర్వాత శుద్ధీకరణ పనులు చేపడితే ఫలితం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

వెంగళరావునగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మధురానగర్ సంక్షేమ సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో చిన్నారులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం నారీ శక్తి మీద వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని కాలనీ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు తెలిపారు. పోటీలో గెలుపొందిన వారికి ఈ నెల 12న కమ్యూనిటీ హాలులో బహుమతులు అందజేస్తామన్నారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన మహిళలను సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ

బంజారాహిల్స్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలకు వినియోగించే సెంట్రింగ్ సామాను చోరీకి గురైంది. నాగర్‌కర్నూల్‌కు చెందిన చిర్నం పరమేష్ సెంట్రింగ్ కాంట్రాక్టర్. ఈ నెల 9న బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఓ ఇంటికి సెంట్రింగ్ పనిచేసేందుకు 50 వేల రూపాయల విలువ చేసే సామగ్రి తీసుకొచ్చాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా అవి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో ప్రతీ పౌరుడు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి.వై.ఎఫ్.ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న షహీద్ భగత్‌సింగ్ స్మారక యువజనోత్సవాల పోస్టర్‌ను మంత్రి జూపల్లి తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, యువత చెడు అలవాట్ల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి ఎం.డి.జావీద్ మాట్లాడుతూ.. యువజన ఉత్సవాల సందర్భంగా నగరంలో విస్తృతంగా సదస్సులు, క్రికెట్, చెస్, రన్‌లతో పాటు రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు, భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ, ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జేకే శ్రీనివాస్, ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షుడు స్టాలిన్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ స్మారక యువజనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు



డీఎంసీ జకియా సుల్తానాకు వినతిపత్రం అందజేస్తున్న మధురానగర్ సంక్షేమ సమితి ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

వెంగళరావునగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్ రెడ్డి, కోడె సాంబశివరావు కోరారు. సోమవారం సమితి ప్రతినిధులతో కలిసి యూసుఫ్‌గూడలోని సర్కిల్ 19 కార్యాలయంలో డీఎంసీ జకియా సుల్తానాకు వినతిపత్రం అందజేశారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, వాహనాలను నిలుపుతున్నారని, వీధి దీపాలు వెలగడం లేదని, జీఎఫ్ బ్లాకుల్లో తాగునీరు కలుషితమవుతుందని వారు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు వీధి శునకాలతో ఇబ్బందులు వంటి పలు సమస్యలను డీఎంసీ దృష్టికి తీసుకొచ్చారు. డీఎంసీ జకియా సుల్తానాను కలిసిన వారిలో సమితి ఉపాధ్యక్షుడు మనోహర్ రావు, సంయుక్త కార్యదర్శి హనుమంత రావు తదితరులు ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

2026 నాటికి టీజీఎస్ ఆర్టీసీకి రూ.10 వేల కోట్ల టర్నోవర్

- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది 2026 నాటికి ఆర్టీసీ రూ. 10 వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకునే అవకాశముందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో కార్పొరేట్ ఫెయిల్యూర్ అండ్ డిజిటల్ ఫ్రాడ్, విజయానికి మార్గాలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సజ్జనార్ మాట్లాడుతూ.. 2021 సెప్టెంబర్‌లో ఆర్టీసీ ఎండీగా తాను బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ మొత్తం టర్నోవర్ రూ.3800 కోట్లు కాగా, నాలుగేళ్లలో దాన్ని భారీగా పెంచామన్నారు. ఇప్పుడు ఆర్టీసీని బిలియన్ డాలర్ల కంపెనీగా మార్చినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న 50 వేల మంది ఉద్యోగుల నిబద్ధత, ధృడ సంకల్పం, ప్రభుత్వ మద్దతుతో ఇది సాధ్యమైనదన్నారు. ప్రస్తుతం ఏఐ, బిగ్ డేటా పెరుగుదల డిజిటల్ మోసాల పరిధిని పెంచిందన్నారు. డిజిటల్ మోసాలను నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సాయిరామ్ పాలబిందెల, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్, కై.మహేశ్వరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

గాజులరామారం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. సూరారం సీఐ భరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం శ్రీరాంనగర్ కాలనీ వెంకటప్రగతి రెసిడెన్సీకి చెందిన శేఖర్‌రెడ్డి తండ్రి మన్మధరెడ్డి(60) ఈ నెల 8న సాయంత్రం భోజనం చేసి పడుకున్నాడు. శనివారం ఉదయం చూసేసరికి అతడు ఇంట్లో కనిపించలేదు. ఉదయం వాకింగ్‌కు వెళ్లాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో తెలిసిన వారు, బంధువుల వద్ద ఆరా తీశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో ఆయన కుమారుడు సోమవారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల మధ్య ఉన్న స్నేహం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ప్రేమికుడు మోసం చేయడంతో యువతి సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పేట్‌బషీర్‌బాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లాకు చెందిన కండెల ప్రియాంక(27) ఎంబీఏ పూర్తిచేసి మూడు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి కుత్బుల్లాపూర్‌లోని వెన్నెలగడ్డలోని ఓ వసతి గృహంలో ఉంటోంది. తురకపల్లిలోని డైసిల్‌టెక్స్ నాలెడ్జి పరిశ్రమలో ఉద్యోగం చేస్తుంది. శ్రీకాకుళం జిల్లా బేగంపేటకు చెందిన రవికుమార్ పీజీ పూర్తి చేసి ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి సుభాష్ నగర్‌లో ఉంటున్నాడు. ప్రియాంక పని చేస్తున్న పరిశ్రమలోనే విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వారు ప్రేమించుకున్నారు. అయితే ఆదివారం రాత్రి ప్రియంక రవికుమార్‌ను పెళ్లి చేసుకోవాలని అడగ్గా అందుకు అతడు నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి తాను ఉంటున్న వసతి గృహంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రియాంక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

న్యూసెన్స్‌కు పాల్పడుతున్న ముగ్గురు మహిళలకు జైలుశిక్ష

పంజాగుట్ట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట ప్రాంతంలో న్యూసెన్స్ చేస్తున్న ముగ్గురు సెక్స్ వర్కర్లకు రెండు రోజుల పాటు జైలు శిక్ష పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు పంజాగుట్ట ప్రాంతంలో పగలు రాత్రి తేడా లేకుండా న్యూసెన్స్ చేస్తున్నారు. వారిపై పోలీసులు 68 సీపీ యాక్ట్ కింద ఈ పెట్టీ కేసులు నమోదు చేశారు. సోమవారం వారిని నాంపల్లిలోని పదవ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా వారికి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. దీంతో వారిని పోలీసులు జైలుకు తరలించారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పేట్ బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రం దేమాజి జిల్లాకు చెందిన ప్రబిత డాలీ(28) ఉపాధి కోసం నగర శివారులోని దేవరయాంజాల్‌కు వలస వచ్చి స్థానికంగా గల డబ్ల్యూఏఎల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన సాయంత్రం పరిశ్రమ నుంచి మల్లన్నకాలనీలో ఉంటున్న స్నేహితుడిని కలవడానికి వెళ్లాడు. అదే రోజు రాత్రి స్నేహితుడి ద్విచక్రవాహనంపై పరిశ్రమకు వస్తుండగా మార్గమధ్యలో సాయి గీతాశ్రమం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో అతడు చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా కోసం వెతకొద్దు.. తనువు చాలిస్తున్నా

- భర్తకు వీడియో కాల్ చేసిన భార్య
- రెండు రోజులుగా వెతుకుతున్నా దొరకని ఆచూకీ

బాలానగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'నాకు క్యాన్సర్ ఉంది.. నేను కోలుకోలేను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. అందుకే నేను కాశీకి వెళ్లి తనువు చాలించాలని అనుకుంటున్నా. నాకోసం వెతక కండి. బాబును స్కూలు వద్ద దింపి వెళుతున్నా..' అంటూ భర్తకు మెసేజ్ ద్వారా సమాచారం ఇచ్చి ఓ ఇల్లాలు అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. వివరాలిలా ఉన్నాయి.. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాల్‌రెడ్డినగర్‌లో ధన్యాకుల రమేష్‌బాబు, ఉమారాణి (40) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఉమారాణి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చికిత్స చేయించుకుంటున్నా నయం కావడం లేదనే మనోవ్యథతో ఆవేదన చెందుతుండేది. అయితే, భర్తను కష్టపెట్టవద్దని మహిళా దినోత్సవం (మార్చి 8న) రోజున నిర్ణయం తీసుకుంది. బాబును స్కూలుకు తీసుకెళ్తున్నానని భర్తకు చెప్పి సెల్‌ఫోన్‌తో వెళ్లింది. డ్యూటీకి ఆలస్యం అవుతుండడంతో ఇంటికి తాళం వేసి భర్త ఆఫీసుకు వెళ్లిపోయాడు. అయితే, మధ్యాహ్నం 12.47 గంటలకు భర్తకు వీడియో కాల్ చేసి 'నా అనారోగ్యం కారణంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని నిర్ణయించుకున్నాను. నేను తనువు చాలించాలనుకుంటున్నాను. కాశీకి వెళుతున్నా.. నాకోసం వెతకొద్దు..' అంటూ 3 నిముషాలు మాట్లాడి సెల్ స్విచ్ ఆఫ్ చేసింది. ఆ వెంటనే పలు చోట్ల వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో రమేష్‌బాబు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఉమారాణి (ఫైల్)

కాశీకి వెళ్లి వచ్చిన పోలీసులు

ఉమారాణి ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా బాలానగర్ పోలీసులు కాశీకి వెళ్లారు. అక్కడి పోలీసులతో కలిసి ఆమె కోసం వెతుకుతున్నట్లు సమాచారం. అయితే, ఉమారాణి సెల్ నెట్‌వర్క్ చివరిసారిగా కాశీ చూపించినప్పటికీ ఎటువంటి అఘాయిత్యం చేసుకుని ఉండదని భావిస్తున్నారు. మరెక్కడికైనా వెళ్లిందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు.

వృద్ధురాలికి మాయమాటలు చెప్పి పుస్తెల తాడుతో పరారు

- 12 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

నిజాంపేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలికి మాయ మాటలు చెప్పి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కుని పరారైన వ్యక్తిని 12 గంటల వ్యవధిలో బాచుపల్లి పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసి సోమవారం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. ఈ విషయమై బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ ఉపేందర్, డీఐ యాదయ్యలతో సోమవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ప్రవీణ్‌సాగర్(30) నిజాంపేట రాజీవ్ గృహకల్ప ప్రాంతంలోని ప్రగతినగర్‌లో నివాసముంటూ స్విగ్గీ, జొమాటో, రియోలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న కెళ్ల బాలమ్మ(55) ఇంటికి వెళ్లి మీకు రియో నుంచి పార్సిల్ వచ్చిందని చెప్పి అందజేశాడు. అనంతరం తాను కూడా రాజీవ్ గృహకల్పలో నివసిస్తున్నానంటూ మాటలు కలిపి ఆమె వద్దనున్న రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. బాలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఉపేందర్ పర్యవేక్షణలో క్రైం డీఐ యాదయ్య సిబ్బందితో నిఘా పెట్టారు. 12 గంటల వ్యవధిలో అతడిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతడి నుంచి గొలుసును స్వాధీనం చేసుకున్నారు.



యూసుఫ్‌గూడ మెట్రో స్టేషన్ కింద వ్యాపారాలు



కృష్ణానగర్ ప్రధాన రహదారిపై

రోడ్లపై వ్యాపారాలు.. ప్రజలకు ఇబ్బందులు

యూసుఫ్‌గూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో వారంతపు సంత నిర్వహించే వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వ్యాపరాలు చేస్తున్న వారిని నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానగర్, వెంకటగిరి, యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ నుంచి కృష్ణానగర్, ఎ, బి బ్లాక్ ప్రధాన రహదారి పొడవునా తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. యూసుఫ్‌గూడ మెట్రో స్టేషన్ కింద ఆటో ట్రాలీలు, తోపుడు బండ్లతో పాటు అమ్మవారి గుడి పక్కన చేపల వ్యాపారుల వద్ద జనం గుమికూడి ఉండటం ట్రాఫిక్‌కు పెద్ద సమస్యగా మారుతుంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో తోపుడు బండ్లు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్లపై బండ్లు పెట్టకుండా చూడాలి

ప్రతిరోజూ ఏదో ఒక బస్తీలో సంత పేరుతో రోడ్లపై వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డుపై వ్యాపారాలు చేయడం, సరుకులు, కూరగాయలు కొనడానికి వచ్చిన వారు రాంగ్ రూట్‌లో వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.



- జె.స్వామి, సీఐటీయూ నాయకుడు

2026 నాటికి రూ. 10 వేల కోట్ల టర్నోవర్

● టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్



సదస్సులో మాట్లాడుతున్న టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది 2026 నాటికి ఆర్టీసీ రూ.10 వేల కోట్ల టర్నోవర్ చేరుకునే అవకాశముందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో కార్పొరేట్ ఫెయిల్యూర్ అండ్ డిజిటల్ ఫ్రాడ్, విజయానికి మార్గాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సజ్జనార్ మాట్లాడుతూ 2021 సెప్టెంబర్‌లో ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ మొత్తం టర్నోవర్ రూ.3,800 కోట్లు కాగా, నాలుగేళ్లలో దాన్ని భారీగా పెంచి ఇప్పుడు ఇది బిలియన్ డాలర్ల కంపెనీగా మార్చినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న 50 వేలమంది ఉద్యోగుల నిబద్ధత, ధృఢ సంకల్పం, ప్రభుత్వ మద్దతుతో ఇది సాధ్యమైందన్నారు. ప్రస్తుతం ఏఐ, బిగ్ డేటా పెరుగుదల డిజిటల్ మోసాల పరిధిని పెంచిందన్నారు. డిజిటల్ మోసాలు నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సాయిరామ్ పాలబిందెల, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్, కెకె.మహేశ్వరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన 'ఎనిమిదో అడుగు'


ఏనిమిదో అడుగు నాటికలోని ఓ సన్నివేశం

చిలకలగూడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏడడుగులు కలిసి నడిచిన భార్యాభర్తలు సంసార జీవితం సాగించాలి అనే సందేశంతో ఎనిమిదో అడుగు నాటిక ప్రదర్శించారు. సికింద్రాబాద్ రైల్ నిలయం ఆడిటోరియంలో సోమవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్, శ్రీ జయఆర్ట్స్ ఆధ్వర్యంలో రచయిత ఎం.దివాకర్ బాబు ఎనిమిదో అడుగు నాటిక ప్రదర్శించారు. నటీనటులు డాక్టర్ శ్రీజ సాధినేని, శశిధర్, అవినాష్‌యాదవ్ తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సంగీతం సామంచి చైతన్య, రంగాలంకణ సురభి రాయలు, సురభి జయవర్ధన్ మేకప్ శశికిరణ్ సమకుర్చారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అశోక్

రాంగోపాల్‌పేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని రాణిగంజ్ ఎండ్లబండి అడ్డ వద్ద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఐఎం రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పాపడ్ అశోక్ సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెన్డీ ఇచ్చిన లేఖను తహసీల్దార్‌కు ఆయన అందజేశారు. స్పందించిన తహసీల్దార్ ఇప్పటికే ఆ నిర్మాణం సర్వే చేయించామని, త్వరలో నోటీసులు అందజేస్తామని తెలిపారని అశోక్ పేర్కొన్నారు.

నల్లపోచమ్మ ఆలయం వద్ద అన్నదానం


నల్లపోచమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న జంపన్న ప్రతాప్, సుధీర్

బోయిన్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నిదానాలు చేసినా రానిపుణ్యం అన్నదానంతో కలుగుతుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ప్రముఖ సామాజికవేత్త దివంగత సుమిత్రనాథ్ 75వ జయంతిని పురస్కరించుకొని బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ జంపన ప్రతాప్, ప్రముఖ పారిశ్రామికవేత్త పృధ్వీనాథ్, సుధీర్ కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అనిల్, ప్రణీత, రాజు, అజిత్ కళ్యాణ్, ప్రేమ్‌కుమార్‌ముదిరాజ్, రామారావు, పటేల్, నరసింహ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● లాలాపేట్‌లో జోనల్ స్పోర్ట్స్ మీట్



శ్రీ చైతన్య విద్యా సంస్థల ఫౌండర్ బీఎస్ రావు జ్ఞాపకార్థం శ్రీ చైతన్య నారాయణగూడ జోన్ ఆధ్వర్యంలో సోమవారం లాలాపేట్‌లోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు నారాయణగూడ జోన్ ఏజీఎం మొగల్‌నూర్ మహ్మద్ బహుమతులతో పాటు, సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌చార్జి మల్లికార్జున్‌నాయుడు, వీరు, రాజశేఖర్, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

- తార్నాక, మార్చి 10(ఆంధ్రజ్యోతి)

● మహిళా దినోత్సవం



మెట్టుగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన మహిళాదినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాసూరి సునిత దాక్టర్, కవిత, వైద్య సిబ్బంది

- చిలకలగూడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి)

వరద కాలువ పనులు

పూర్తయ్యేదెన్నడో?


ఇందిరానగర్‌కాలనీ రోడ్డు నెంబర్-1లో ప్రమాదకరంగా ఉన్న నాలా


నాలాపై స్లాబ్ వేయడానికి ఇనుపచువ్వలు కట్టి నిర్లక్ష్యంగా వదిలేసిన దృశ్యం

● నిధులు రావడంలేదని పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్

● ప్రమాదాల బారిన పడుతున్న ఇందిరానగర్ కాలనీవాసులు

బౌద్ధనగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌కాలనీలో వరద నీటి కాలువ (స్ట్రామ్‌వాటర్ డ్రైన్) పనులు ముందుకుసాగడం లేదు. కాంట్రాక్టర్ పనులు నిలిపివేయటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 2022వ సంవత్సరంలో ఇందిరానగర్‌కాలనీ రోడ్డు నెంబర్-1 నుంచి 5వరకు సుమారు రూ.70లక్షల వ్యయంతో వరద కాలవు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకపోవటంతో జీహెచ్‌ఎంసీ అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. తర్వాత అప్పటి డిప్యూటీ స్పీకర్, ప్రసుత్త ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, స్థానిక కార్పొరేటర్ సామల హేమ, ఉన్నతాధికారులతో కలిసి హంగు ఆర్భాటంతో వరద కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి కొద్ది కొద్దిగా పనులు చేస్తున్నారు. తర్వాత నిధులు విడుదల కాకపోవటంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. స్థానికులంతా పలుమార్లు ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు మొరపెట్టుకోవటంతో నాలుగునెలల క్రితం మళ్లీ పనులను మొదలుపెట్టారు. వరద కాలువ పనులకు అదనంగా మరో రూ.20లక్షలు కేటాయించారు. కాంట్రాక్టర్ ఈ పనులను మరో సబ్‌కాంట్రాక్టర్‌కు అప్పజెప్పారు. ఇందిరానగర్‌కాలనీలో వరద కాలువ కోసం రోడ్డు పక్కన తవ్వారు. నెల రోజుల క్రితం నాలాపై స్లాబ్ వేయడానికి కొంతభాగం ఇనుప చువ్వలను కట్టించిన కాంట్రాక్టర్ నిధులు సరిగ్గా విడుదల కావడం లేదని ఇటీవల పనులను నిలిపివేశారు.

ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడంతో..

ఇందిరానగర్‌కాలనీలో చేపట్టిన వరద కాలువ పనుల వద్ద ఎటువంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో గతనెల ఫిబ్రవరి 15న రాత్రి మేడిబావికి చెందిన సురేష్ ఓపెన్ నాలాలో పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇలానే పలువురు నాలాలో పడి ప్రమాదాల బారిన పడ్డారని స్థానికులు పేర్కొన్నారు. ఈ పనులు జరుగుతున్న ప్రాంతానికి కూతవేటు దూరంలో స్కూళ్లు ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఎవ్వరు అందులో పడిపోతారోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నాలాపై స్లాబ్ వేయడానికి ఏర్పాటు చేసిన ఇనుపచువ్వలు తగిలి గాయాలవుతున్నాయని స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలా కోసం రోడ్డు పక్కన తవ్వి పనులు నిలిపివేయడంతో అందులోకి చెత్తాచెదారం చేరి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రోడ్లను తవ్వివేయటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాహనదారులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి నాలా పనులను పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పనులను త్వరగా పూర్తిచేయాలి



సీతాఫల్‌మండి ఇందిరానగర్‌కాలనీలో చేపట్టిన స్ట్రామ్‌వాటర్ డ్రైన్ పనులను త్వరగా పూర్తి చేయాలి. పనులు ముందుకు సాగకపోవటంతో ఐదురోడ్లకు చెందిన కాలనీవాసులు అవస్థలకు గురవుతున్నారు. కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ మధ్య సరైన పొంతన లేకపోవటంతో ఈ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా నాలాపై స్లాబ్ పనులు పూర్తి చేయాలి.

- నగరపు శ్యామ్, ఇందిరానగర్‌కాలనీ అధ్యక్షుడు

సమస్యలను పట్టించుకోవడం లేదు



ప్రజాప్రతినిధులు, అధికారులు ఇందిరానగర్‌కాలనీ సమస్యలను పట్టించుకోవటం లేదు. నాలాను తవ్వి నిర్లక్ష్యంగా వదిలివేశారు, అందులో ఎప్పుడు ఎవ్వరు పడతారో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నాలాపై స్లాబ్ పనులను వెంటనే పూర్తి చేయాలి.

- భార్గవి, గృహిణి, ఇందిరానగర్‌కాలనీ, రోడ్డు నెంబర్-1

చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయొద్దు

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


ఎమ్మెల్యే తలసానిని కలిసిన చిరు వ్యాపారులు, తదితరులు

మారేడుపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నిరుపేదలైన ఫుట్‌పాత్ వ్యాపారులను అధికారులు ఇబ్బందులు పెట్టొద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సోమవారం రాంగోపాల్‌పేట్, నల్లగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన ఫుట్‌పాత్ వ్యాపారులు, జీహెచ్‌ఎంసీకి చెందిన షాపులలో అద్దెపై వివిధరకాల వ్యాపారాలు చేసుకుంటున్న వారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి ఫుట్‌పాత్‌లపై, తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వారికి జీవనాధారం లేకుండా చేసి, ఆ కుటంబాలను రోడ్లపాలు చేస్తారా అని ప్రశ్నించారు. వ్యాపారాలు లేక ఇబ్బందులుపడుతున్న సమయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు షాపుల అద్దెలను పెంచాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో నాయకులు ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, చిరు వ్యాపారులు హలీం, హన్మంతరావు, ఇమ్రాన్, నర్సింగరావు, కిరణ్, తదితరులు ఉన్నారు.

సావిత్రీబాయి ఫూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం


సావిత్రిజ్యోతిబాయి ఫూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న మల్లేశ్వరపు రాజేశ్వరి

బౌద్ధనగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సంఘసంస్కర్త, ప్రజాసేవకురాలు, మొదటి మహిళా విద్యావేత్త సావిత్రీబాయి ఫూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రీబాయి ఫూలే వర్ధంతి కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, నాయకులు కనకట్ల హరి, వెంకటేశ్‌గౌడ్, అంబాల రాజేశ్వరరావు, అనిత, మేకల కీర్తి, తదితరులు పాల్గొని సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మెట్టుగూడ కేశవనగర్‌లో..

సికింద్రాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి ఫూలే అడుగు జాడల్లో నడిచి, సమాజాభ్యున్నతికి పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర రజక మహిళా సంఘం వ్యవస్థాపకురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి పిలుపునిచ్చారు. సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలను సోమవారం మెట్టుగూడ కేశవనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ పారిశుధ్య మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. సావిత్రీబాయి ఫూలే యావత్ మహిళా లోకానికి ఆదర్శనీయురాలని అన్నారు. జాన్సి, లలిత, యాదమ్మ, శంకరమ్మ, పోచమ్మ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరులపై అవగాహనా రాహిత్యం

● ఎల్లల దత్తాత్రేయ


నినాదాలు చేస్తున్న దత్తాత్రేయ, తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణలో ఉన్న ఆర్థిక వనరులపై, వచ్చే రాబడులపైన సరైన అవగాహన లేదని ఓయూ జేఏసీ అధ్యక్షుడు ఎల్చల దత్తాత్రేయ ఆరోపించారు. అంతర్జాతీయ మీడియా ఎదుట ఆయన రాష్ట్రం పరువు తీసేలా మాట్లాడారని ఓయూలోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో సోమవారం వారు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ దివాలా తీసిందని, రూ.500 కోట్లు కూడా ప్రభుత్వం వద్ద లేవని అంతర్జాతీయ మీడియా ఎదుట సీఎం హోదాలో ఉన్న అలా చెప్పడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.

నాకోసం వెతకొద్దు.. తనువు చాలిస్తున్నా..

● భర్తకు వీడియో కాల్ చేసిన భార్య

● రెండు రోజులుగా తీవ్రంగా గాలింపు

● నేటికీ దొరకని ఆచూకీ


ఉమారాణి

బాలానగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'నాకు క్యాన్సర్ ఉంది.. నేను కోలుకోలేను. మిమ్మల్ని ఇబ్బంది పెట్ట దలుచుకోలేదు. అందుకే కాశీకి వెళ్లి తనువు చాలించాలని అనుకుంటున్నాను. నాకోసం వెతకకండి. బాబును స్కూలు వద్ద దింపి వెళుతున్నా..' అంటూ భర్తకు సమాచారం ఇచ్చి ఓ ఇల్లాలు అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాల్‌రెడ్డినగర్‌లో ధన్యాకుల రమేష్ బాబు, ఉమారాణి(40) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఉమారాణి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చికిత్స చేయించుకుంటున్నా నయం కావడం లేదనే మనోవ్యధతో ఆవేదన చెందుతుండేది. అయితే, భర్తను కష్టపెట్టవద్దని అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8న) రోజున నిర్ణయం తీసుకుంది. బాబును స్కూలుకు తీసుకెళ్తున్నానని భర్తకు చెప్పి సెల్‌ఫోన్‌తో వెళ్లింది. డ్యూటీకి ఆలస్యం అవుతుండడంతో ఇంటికి తాళం వేసి భర్త ఆఫీసుకు వెళ్లిపోయాడు. అయితే, మధ్యాహ్నం 12.47 గంటలకు భర్తకు వీడియో కాల్ చేసి 'నా అనారోగ్యం కారణంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని నిర్ణయించుకున్నాను. నేను తనువు చాలించాలనుకుంటున్నాను. కాశీకి వెళుతున్నా. నాకోసం వెతకొద్దు.' అంటూ 3 నిమిషాలు మాట్లాడి సెల్ స్విచ్ ఆఫ్ చేసింది. ఆ వెంటనే గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో రమేష్‌బాబు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాశీకి వెళ్లి వచ్చిన పోలీసులు

ఉమారాణి ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా బాలానగర్ పోలీసులు కాశీకి వెళ్లారు. అక్కడి పోలీసులతో కలిసి ఆమె కోసం వెతుకున్నట్లు సమాచారం. అయితే, ఉమారాణి సెల్ నెట్‌వర్క్ చివరిసారిగా కాశీ చూపించినప్పటికీ ఎటువంటి అఘాయిత్యం చేసుకుని ఉండదని భావిస్తున్నారు. మరెక్కడికైనా వెళ్లిందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు.

కరాటే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది

● సినీ నటుడు సుమన్



మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

తార్నాక, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కరాటే విద్యార్థుల్లో శారీరక ధృఢత్వంతో పాటు, ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. బ్రూస్లీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా 15వ వార్షికోత్సవాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకులు ఎన్.శివప్రసాద్ ఆధ్యక్షతన సోమవారం తార్నాకలోని సంఘీ జూనియర్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథిగా హాజరై మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బ్లాక్ బెల్ట్, బ్రౌన్ బెల్ట్‌లతో పాటు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ యువత మానసిక, శారీరక ధృడత్వానికి పాఠశాల, కళాశాల స్థాయి నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైళ్లశాఖ సూపరింటెండెంట్ శివకుమార్, డీఎస్పీ లకావత్ నాయక్, కవి గాయకులు డా. అందెశ్రీ, వాసు తదితరులు పాల్గొన్నారు.

● కరాటేలో దీక్షితకు మెడల్



విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో తుకారాంగేట్‌కు చెందిన దీక్షిత మొదటిస్థానంలో నిలిచి మెడల్ సాధించారు. ఈ సందర్భంగా తుకారాంగేట్‌లోని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సోమవారం ఆయన నివాసంలో దీక్షిత మర్యాదపూర్వకంగా కలిశారు. దీక్షితను ఎమ్మెల్యే అభినందించారు.

- అడ్డగుట్ట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి)

వారాసిగూడ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా రమేష్‌గౌడ్


ఇన్‌స్పెక్టర్ సైదులును సత్కరిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి, డీఐ రమేష్‌గౌడ్, తదితరులు

బౌద్ధనగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్‌గౌడ్‌కు వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ సైదులు బదిలీపై బుద్ధభవన్‌లో ఉన్న హైడ్రాకు వెళ్లారు. బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులను చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, అడ్మిన్ ఎస్సై సుధాకర్, ఎస్సైలు మల్లికార్జున్, ప్రకాశ్‌రెడ్డితోపాటు ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు ఘనంగా సత్కరించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

● తిరుమలగిరిలో విషాదం


యతిన్నాయుడు(ఫైల్)

తిరుమలగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఫొటో షూట్ కోసం వచ్చి ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం రాత్రి కావడంతో మృతదేహం కోసం గాలించినా దొరకలేదు. మరుసటి రోజు ఉదయం డీఆర్ఎఫ్ బృందాలు, జవహర్‌నగర్ పోలీసులు కలిసి 15 మీటర్ల లోతులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీశారు. తిరుమలగిరిలో తల్లి గీతా, సోదరుడు తనీష్‌తో కలిసి ఉంటున్న యతిన్నాయుడు(21) సికింద్రాబాద్‌లోని సేయింట్ మేరీస్ డిగ్రీ కళాశాలలో 3వ సంవత్సరం చదువుకుంటున్నాడు. తనీష్, స్నేహితుడు అభిషేక్‌రాజ్‌తో కలిసి అతను గుట్టల వద్దకు వచ్చి ఫొటో షూట్ చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతిచెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.